క్లుప్తంగా

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

పద్మనాభం : పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని ఐటీడీఎస్ సూపర్ వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని లింగన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపులు వంటి అకృత్యాలు నిర్మూలించేందుకు ప్రభుత్వం పోక్సో చట్టం చేసిందన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, హేమ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాల డంపింగ్



రోడ్డు పక్కన డంప్ చేసిన వ్యర్థాలు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెం జగనన్న కాలనీ నుంచి హైవేకు వెళ్లే రోడ్డు పక్కన రాత్రి సమయాల్లో కొందరు వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. ఇవి రోడ్డు వెంబడి పెద్ద ఎత్తున వేసేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అదే విధంగా దుర్వాసన, ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సుస్థిర పాలన అందించడమే లక్ష్యం

తగరపువలస : సుస్థిర పాలన అందించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని, ఆ మేరకు ప్రధాని మోడీ విజయం సాధించారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు అన్నారు. ఆనందపురం మండలంలోని వెల్లంకి, వేములవలస, బీపీ కళ్లాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాలకు ప్రధాని మోడీ ఫొటోలను అందించారు. కార్యక్రమాల్లో నాయకులు పి.వి.వి.ప్రసాదరావు, మల్లవరపు కృష్ణ, నిమ్మకాయల అప్పలరాజు, బంక సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పీఎం పాలెం : జాతీయ రహదారిపై మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపినందుకు పది మందికి న్యాయమూర్తి రూ.22,500 జరిమానా విధించారు. ఇందుకు సంబంధించి స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.2 వేలు నుంచి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.22,500 జరిమానా న్యాయమూర్తి విధించారని ఎస్ఐ తెలిపారు.

అనియత బోధకుల వివరాలు ఇవ్వాలి

తగరపువలస : జిల్లాలో గతంలో పని చేసిన అనియత బోధకులు, సూపర్‌వైజర్లు తమ బయోడేటాతోపాటు పదో తరగతి నుంచి పీజీ వరకు ఉన్న సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్ లేదా గతంలో నియమితులైనప్పుడు జాయినింగ్ ఆర్డర్ కాపీల జెరాక్స్‌లను మండల విద్యాశాఖ అధికారులకు సమర్పించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మహంతి రమణ, ఉపాధ్యక్షుడు చందక శంకరరావు కోరారు. ప్రభుత్వం కల్పించే ఉద్యోగ అవకాశాలకు అనియత సిబ్బంది వివరాలు విజయవాడలోని రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సమర్పించాల్సి ఉందన్నారు. గతంలో కొందరు వివరాలు పంపించారని, మిగిలిన వారు త్వరగా వివరాలు పంపించాలని ఒక ప్రకటనలో కోరారు.

అధ్వాన పరిసరాలతో వ్యాధుల భయం



వేములవలస పువ్వుల మార్కెట్ సమీపంలో పందుల సంచారం

- వేములవలస మార్కెట్ పరిసరాల్లో క్షీణించిన పారిశుధ్యం
- అవగాహన కార్యక్రమాలకే అధికారులు పరిమితం

తగరపువలస : ఎక్కడికక్కడ పరిసరాలు అధ్వానంగా మారడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని జనం ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయంటూ... ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సంస్థలు, ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమలు, పందుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీలు చేపడుతున్నారు. డ్రైడే పాటించాలని ఉదరగొడుతున్నారు. నివాసాల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా దోమల పెరుగుదలకు కారణమైన ఖాళీ కొబ్బరి బొండాలను నివాసాల సమీపంలో ఉంచొద్దని సూచిస్తున్నారు. ప్రచారంలో ఇలా ఉదరగొడుతున్నప్పటికీ అధికారులు, స్థానిక సంస్థలు వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమైన కూడలిగా వృద్ధి చెందుతున్న ఆనందపురం మండల కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ నుంచి ఏటా బహిరంగ వేలం ద్వారా పంచాయతీకి రూ.కోటికి పైగా ఆదాయం వస్తున్నా... పారిశుధ్య పనులు మాత్రం నిర్వహించడం లేదు. దీంతో మార్కెట్ లోపల, బయట నిత్యం పందులు తిష్టవేసి స్థానికులపై దాడులు చేస్తున్నాయి. ఇక్కడి పరిసరాల్లో పారిశుధ్యం క్షీణించింది. అలాగే వందలాది మంది ప్రయాణికులు వేచి ఉండే ఆనందపురం ఫ్లై ఓవర్ కింద బుట్టలతో ఖాళీ కొబ్బరి బొండాలు దర్శనమిస్తున్నాయి. దోమల వృద్ధికి ఈ కొబ్బరి బొండాలే ప్రధాన కారణమని ప్రచారం చేస్తున్న అధికారులు... ఫ్లై ఓవర్ కింద వున్న వాటిని మాత్రం తొలగించడం లేదు. అవగాహన కార్యక్రమాలతో సరిపుచ్చడం కాకుండా వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.



ఆనందపురం ఫ్లై ఓవర్ కింద బుట్టలో ఖాళీ కొబ్బరి బొండాలు

మత్తు పదార్థాలతో అనర్థాలు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ చిరంజీవిరావు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు, రహదారులపై నడిచి వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, రవాణా వంటివి నేరమన్నారు. వీటిపై ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తెలుగు సాహిత్యం సామాజికత' పుస్తకం ఆవిష్కరణ



ఆవిష్కరించిన పుస్తకంతో ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు

భీమునిపట్నం : భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ డి.ప్రవీణ రచించిన 'తెలుగు సాహిత్యం సామాజికత' పుస్తకాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ఇటువంటి మంచి పుస్తకాల అవసరం ఎంతో ఉందన్నారు. ఈ విషయంలో అధ్యాపకురాలు ప్రవీణకు ప్రత్యేక అభినందలని, ఇటువంటి వాటిని అందరూ ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు ఇటువంటి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ద్రోహం



మధురవాడలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మధురవాడ : రాష్ట్రానికి పదేళ్లుగా ద్రోహం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం మరోసారి వంచించిందని సీపీఎం, సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీల నాయకులు అన్నారు. ఈ నెల 23న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రం పట్ల వివక్ష కొనసాగించారని సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై శుక్రవారం మధురవాడ కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్లకార్డులు, బ్యానర్‌లు ప్రదర్శించి నినాదాలు చేశారు. రాజధాని నిర్మాణానికి వివిధ ఆర్థిక సంస్థలు, ప్రపంచ బ్యాంక్ ద్వారా రూ.15 వేల కోట్లు సర్దుబాటు చేస్తామని చెప్పారు తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. విభజన చట్టంలో అమలు చేయాల్సిన పనులకు ఎంత కేటాయిస్తారన్నది కూడా చెప్పలేదన్నారు. విశాఖకు రైల్వే జోన్, మెట్రో, స్టీల్‌ప్లాంట్‌కు కేటాయింపులు లేవన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలోకి వర్షపు నీరు



తర్లువాడ ఆరోగ్య ఉప కేంద్రంలో వర్షం నీరు

తగరపువలస : ఆనందపురం మండలం తర్లువాడ ఆరోగ్య ఉపకేంద్రం అపరిశుభ్ర వాతావరణంలో ఉండటంతో ఇక్కడకు గర్భిణులు, రోగులు రావడానికి ఆసక్తి చూపడం లేదని స్థానిక స్వచ్ఛంద సేవకుడు కోరాడ ఆదినారాయణ అన్నారు. శిథిలమైన ఈ భవనం చుట్టూ మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన కారణంగా ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు ఇందులోకి అడుగు పెట్టలేకపోతున్నారన్నారు. వర్షం నీరు భవనంలోకి చేరడంతో అందులోనే సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్య ఉప కేంద్రానికి దుర్వాసన నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఆయన కోరారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట : మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ కోరారు. అమరావతిలోని సచివాలయంలో మత్స్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎ.బాబుతో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై జానకీరామ్, ఇతర బోట్ల యజమానులు శుక్రవారం సమావేశమయ్యారు. ఇటీవల తుఫాన్ సందర్భంగా గోపాల్‌పూర్ పోర్టులోకి విశాఖపట్నం ఫిషింగ్ బోట్లను అనుమతించకుండా ఇబ్బంది పెట్టిన విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తెచ్చారు. తుఫాను తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో గోపాల్‌పూర్ పోర్టు సెక్యూరిటీ బోట్లపైకి రాళ్లు విసిరి పోర్టు వెలుపలకు ఫిషింగ్ బోట్లను ఘోరంగా పంపించడంతో మత్స్యకారుల ప్రాణానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. మరోవైపు 2 వేల మంది మత్స్యకారులు మత్స్యకార భరోసాకు అనర్హులని విశాఖ జిల్లా మత్స్యశాఖ జేడీ కార్యాలయం ప్రకటించడంతో ఎంతో మంది తీవ్రంగా నష్టపోతారన్నారు. మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని కోరారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించారని, గోపాల్‌పూర్ పోర్టుకి వెళ్లే మత్స్యకారులను ఇబ్బంది పెట్టొద్దని గంజాం జిల్లా కలెక్టర్‌కి, ఒడిశా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తామన్నారని జానకీరామ్ తెలియజేశారు.

జూలో చిత్రలేఖన పోటీలు రేపు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శుక్రవారం తెలిపారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జూలో జరుగుతాయన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు పులులు, వాటి పిల్లలు, 6 నుంచి 10వ తరగతి వరకు పులులపై మానవ ప్రభావం, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు పులులపై వాతావరణ మార్పులు అనే అంశాలపై చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 29న ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస : ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, అందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఆనందపురం మండల డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ అన్నారు. 'కొండను కొల్లగొట్టేస్తున్నారు' శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు, నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి, గ్రావెల్ తరలించే యంత్రాలు, లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

డిజిటల్ వనరుల వినియోగం పెరగాలి

తగరపువలస : మారుతున్న ప్రపంచంతోపాటు అందుబాటులో ఉన్న డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తరక్ కో ఆర్డినేటర్ శంకర్ అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుక్రవారం ఆయన జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిజిటల్ వనరుల వినియోగంపై తెలియజేశారు. బోధనలో కూడా డిజిటల్ వనరుల వినియోగం పెరగాలన్నారు. ఉపాధ్యాయులు వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. దీక్ష యాప్ ద్వారా కోర్సులు, సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధం గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న వైద్యాధికారి కిషోర్

మధురవాడ : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జీవీఎంసీ జోన్ – 2 వైద్యాధికారి, జీవీఎంసీ వెటర్నరీ అధికారి కిషోర్ హెచ్చరించారు. జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని అన్ని వార్డుల్లో ప్లాస్టిక్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యమిచ్చి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. జోనల్ కార్యాలయంలో హెల్త్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణ ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. అలాగే ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందన్నారు. పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నడింపల్లి శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కాకర శ్రీను, ఎస్.సంతోష్, కె.సీతారామ్, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల విజయ దివస్ ర్యాలీ



తగరపువలసలో కొవ్వొత్తులు వెలిగించి కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

తగరపువలస : విజయ దివస్ సందర్భంగా శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ కూడలిలో మాజీ సైనికులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. విశ్రాంత సుబేదార్ మట్టా అప్పల నరసయ్యరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనికులు అలనాటి కార్గిల్ యుద్ధ వీరులను స్మరించుకున్నారు. 1996 జూలైలో అమరులైన వారికి నివాళులర్పించారు. కార్గిల్ పోరులో పాల్గొన్న టి.ఎస్.రాణి, సాడి రమణమూర్తి, ఎరుసు వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి, వి.వెంకటరమణ, మేకల శ్రీను, అప్పలరెడ్డి, అప్పలనరసయ్య, చేట్ల సూరిబాబు, శీరపు రాజారావు, గోవిందరావు, కల్యాణ్, మురళి, ఫిజికల్ ఫిట్‌నెస్ విద్యార్థులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, దళాయి శివ, గొరుసు సూరిబాబు, డెక్కతి ధనశేఖర్, కొల్లి రవి, రామకృష్ణ, చిల్ల అప్పలరెడ్డి, చిల్ల సంతోష్, జీరు మురళి, బైరెడ్డ మురళి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ప్రమీల

భీమునిపట్నం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అవి ఎక్కడా జరగకుండా చూడాలని శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ప్రమీల సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు చేపట్టిన మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎగువపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం ఆమె మాట్లాడారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాతే వివాహం చేయాలని, ముందుగా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ క్రేంద్రాల్లో పని చేసే వారిపై వుందన్నారు. ఇటువంటివి తెలిస్తే ముందుగానే అధికారులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటారని, ఆ మేరకు సహకరించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతికుమారి, అచ్యుతాంబ, సత్య పాల్గొన్నారు.

రేషన్ షాపులో చోరీ

పీఎం పాలెం : స్థానిక రెండో బస్టాపు సమీపంలో బియ్యం విక్రయించే షాపులో చోరీ జరిగింది. గురువారం రాత్రి జరిగిన చోరీకి సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎం పాలెం బాబానగర్‌కు చెందిన పొట్నూరు భరత్ పెదనాన్నకు స్థానిక 2వ బస్టాపు సమీపంలో బియ్యం బస్తాలు విక్రయించే షాపు ఉంది. పెదనాన్న కొద్ది రోజుల కిందట ఊరు వెళ్లడంతో భరత్ ఆ షాపు చూసుకుంటున్నాడు. గురువారం రాత్రి 9 గంటలకు షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు వచ్చి చూసే సరికి షాపు షట్టర్ తాళాలు తెరిచి ఉన్నాయి. లోపల కౌంటర్‌లో భద్రపరిచిన రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం బస్తాలు మూడు, 10, 5 కిలోల బియ్యం సంచులు 20 పోయినట్టు గుర్తించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అందరి సహకారంతో దోమల నియంత్రణ



నరసయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



భీమిలి మెయిన్ రోడ్డులో ర్యాలీలో అధికారులు, మహిళలు



ఏనుగులపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

భీమునిపట్నం : దోమల వల్ల అనేక రోగాలు ప్రబలుతాయని, వాటిని నిర్మూలించడానికి అందరూ సహకరించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి కోరారు. దోమల నిర్మూలనపై స్థానిక మెయిన్ రోడ్డులో మహిళలతో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా సోకుతాయన్నారు. అందరూ తమ ఇళ్ల వద్ద దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. పారిశుధ్య సిబ్బంది కూడా అన్ని ప్రాంతాల్లోనూ ఫాగింగ్ చేస్తూ, కాలువల్లో మందు పిచికారీ చేస్తున్నారని, చాలా వరకు దోమలు నియంత్రించారన్నారు. పారిశుధ్య అధికారి బి.మహాలక్ష్మినాయుడు, మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, కార్పొరేటర్ గంటా అప్పలకొండ పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం

పద్మనాభం : వర్షాలు కురుస్తున్నందున డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం వి.ప్రభాకర్ సూచించారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో శుక్రవారం దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. దోమలు పెరగకుండా అవి గుడ్లు పెట్టే నీరు నిల్వ ఉండే కుండీలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, విరిగిపోయి పడేసిన పాత ఫర్నీచర్, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ లక్ష్మి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తగరపువలస : దోమల నివారణకు భీమిలి మండలంలోని తాళ్లవలస, అమనాం, టి.నగరపాలెం పంచాయతీల్లో వెలుగు శాఖ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వాటి నివారణకు దోమలు వృద్ధి చెందకుండా చూడాలని ర్యాలీలు నిర్వహించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామాల్లో డ్రైడే నిర్వహించాలని సూచించారు. దోమలు గుడ్లు పెట్టే ప్రదేశాలైన నీరు నిల్వ ఉండే కుండీలు, ఫ్రిడ్జ్ వెనుక భాగాలు, ఏసీలు, పూల కుండీల కింద ప్లేట్లు, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు ఎలా శుభ్రం చేయాలో చూపించారు. కార్యక్రమంలో ఏపీఎం బి.రంగారావు, సీసీ అప్పలనారాయణ, మణి, పంచాయతీ కార్యదర్శి వై.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అంతర్గత రహదారులు



చిట్టివలస శ్మశానవాటికలో నిర్మించిన సీసీ రోడ్డు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల ప్రజల ప్రయోజనార్థం గోస్తనీ నది వద్ద చిట్టివలస శ్మశానవాటికలో అదనపు వసతులు సమకూరాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. గతంలో వర్షం కురిస్తే శ్మశానవాటికలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. అంతేకాకుండా మొత్తం తుప్పలతో నిండి వుండడంతో అంత్యక్రియలకు వచ్చే మృతుల బంధువులు భయపడిపోయేవారు. ప్రస్తుతం శ్మశానవాటిక నలుమూలలా సీసీ రోడ్లు నిర్మించడంతో వర్షం కురిసినా లోపల తిరిగేందుకు అనువుగా ఉంది. అంతేకాకుండా తుప్పలు పెరగకుండా సీసీరోడ్లు అడ్డంగా ఉంటున్నాయి. దీంతో ఇప్పుడు తమ ఆత్మీయుల శవయాత్ర ద్వారా శ్మశానవాటికకు వచ్చే వారికి ఇబ్బందులు లేవని పలువురు అంటున్నారు.